క్లుప్తంగా

పేద కుటుంబానికి చేయూత


సరుకులు అందజేస్తున్న సమితి ప్రతినిధులు

నకిరేకల్ : పట్టణంలోని మూసీ రోడ్డు పద్మశాలీనగర్‌లో అయిటిపాముల అరుణ కుటుంబానికి నానా సేవా సమితి అధ్యక్షుడు వనగండ్ల సైదులు ఆదేశానుసారం సమితి ప్రతినిధులు సోమవారం 25 కేజీల బియ్యం, రూ.1000 విలువ గల కిరాణ సామాన్లు అందజేశారు. కార్యక్రమంలో సేవా సమితి ఇన్‌చార్జ్ యాతాకుల శేఖర్, మేడిపల్లి పుల్లయ్య, చెడిపల్లి కాశీరాం, కందికంటి వెంకన్న పాల్గొన్నారు.

లంబాడీల హక్కులను కాలరాస్తే ఊరుకోం

మర్రిగూడ : లంబాడీల హక్కులను కాలరాసే విధంగా ఎవరైనా ప్రవర్తిస్తే ఊరుకోబోమని గిరిజన విద్యార్థి సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు మెగావత్ చందునాయక్ అన్నారు. సోమవారం గిరిజన విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నా కోసం హైదరాబాద్ వెళ్తున్న చందునాయక్‌ను తన నివాసంలో పోలీసులు అరెస్ట్ చేసి మర్రిగూడ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని ప్రకటనలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, సోయం బాపురావులను కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని కోరారు.

రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సైదులు


పెంజర్ల సైదులు

కట్టంగూర్ : తెలంగాణ పబ్లిక్ అండ్ ప్రైవేటు రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కట్టంగూర్ మండలంలోని ఇస్మాయిల్‌పల్లి గ్రామానికి చెందిన పెంజర్ల సైదులు ఎన్నికయ్యారు. సోమవారం హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన రాష్ట్ర నాలుగో మహాసభలో సైదులును ఎన్నుకున్నారు.

24న విప్లవ పార్టీల విలీన సభ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

గట్టుప్పల్ : మహబూబాబాద్ జిల్లా బయ్యారంలో 24న జరిగే సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రటిక్ రెవల్యూషనరీ ఎన్టీఆర్ పార్టీల విలీన సభను విజయవంతం చేయాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి వల్లూరి మల్లేష్ పిలుపునిచ్చారు. సభకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన సోమవారం గట్టుప్పల్ మండల కేంద్రంలో ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో వరికుప్పల వెంకటేశం, పుల్లయ్య, బాలన్ యాదయ్య, పెద్దగాని భిక్షం, మాడుగుల సత్తయ్య, మాడుగుల రామచంద్రం, మాడుగుల దాసు, వెంకటేశం పాల్గొన్నారు.

రికార్డులు అప్పగింత


రికార్డులు అందజేస్తున్న డ్వాబ్ ప్రతినిధులు

నల్లగొండ టూటౌన్ : పట్టణంలోని గొల్లగూడలో డ్వాబ్ నేతృత్వంలోని అంధుల పాఠశాల మూసివేత సర్టిఫికెట్ అందించాలని కోరుతూ డ్వాబ్ ప్రతినిధులు సోమవారం ఎంఈఓ అరుంధతికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తమ వద్ద ఉన్న రికార్డులు అప్పగించారు. అనంతరం డ్వాబ్ ప్రధాన కార్యదర్శి పానుగోటి చొక్కారావు మాట్లాడుతూ అంధుల పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు తమ మార్కుల జాబితా, ఇతర ధృవపత్రాల కోసం నల్లగొండ ఎంఈఓ కార్యాలయంలో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట దేవిరెడ్డి లింగారెడ్డి తదితరులు ఉన్నారు.

లక్ష్మీనరసింహారావుకు జాతీయ పురస్కారం


పురస్కారం అందుకుంటున్న మంచిరాజు లక్ష్మీనరసింహారావు

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణానికి చెందిన నాటక రంగ కళాకారుడు మంచిరాజు లక్ష్మీనరసింహారావు నాటకరత్న తెలంగాణ ఐకాన్ జాతీయ పురస్కారం–2025 అందుకున్నారు. నాటక రంగంలో విశేష కృషికి గాను వసుంధర విజ్ఞాన వికాస మండలి, వైద్యుల గ్లోబల్ ఫౌండేషన్ వారు లక్ష్మీనరసింహారావును పురస్కారానికి ఎంపిక చేశారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ సాహిత్య అకాడమి సౌజన్యంతో సోమవారం హైదరాబాద్ రవీంద్ర భారతిలో జరిగిన కార్యక్రమంలో లక్ష్మీనరసింహారావుకు పురస్కారం అందజేశారు.

శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు నల్లగొండ పట్టణంతోపాటు నల్లగొండ, నకిరేకల్, మునుగోడు నియోజకవర్గాల్లో సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవ కమిటీ నిర్వాహకులు అందంగా మండపాలను ఏర్పాటు చేసి అందులో దుర్గామాత విగ్రహాలను ప్రతిష్ఠింపజేశారు. ఈ సందర్భంగా అమ్మవారి విగ్రహాలకు అర్చకులు పూజలు నిర్వహించారు. ప్రజా ప్రతినిధులు, భక్తులు పూజలో పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్


చిట్యాల : పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే వేముల వీరేశం - పుష్ప దంపతులు


రామగిరి : దేవీ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నల్లగొండ పట్టణంలోని ముత్యాలమ్మ ఆలయంలో పూజలో పాల్గొన్న భక్తులు


శాలిగౌరారం : వల్లాలలో..


గట్టుప్పల్ మండల కేంద్రంలో..


నకిరేకల్ : సంతోష్‌నగర్‌లో అమ్మవారి ఊరేగింపు వేడుకలు


నల్లగొండ పట్టణంలోని రాక్‌హిల్స్ కాలనీలో..


నార్కట్‌పల్లి : మండల కేంద్రంలోని 13వ వార్డులో..


కేతేపల్లి : శివాలయంలో దుర్గాదేవి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

ఆపదలో ఉన్నవారికి అండగా సీఎం సహాయనిధి

● నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్ : ఆపదలో ఉన్నవారికి సీఎం సహాయనిధి అండగా ఉంటుందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్‌లోని తన క్యాంప్ కార్యాలయంలో సోమవారం నియోజకవర్గంలోని 246 మంది లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి కింద మంజూరైన రూ.86 లక్షల విలువ గల చెక్కులను ఆయన అందజేసి మాట్లాడారు. వైద్య కోసం అత్యవసర పరిస్థితుల్లో చికిత్స పొందుతున్న వారికి ఈ నిధి భరోసాగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో నకిరేకల్ మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజితాశ్రీనివాస్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ నాగులంచ వెంకటేశ్వరరావు, మాద యాదగిరి, పన్నాల రాఘవరెడ్డి, బచ్చుపల్లి గంగాధర్‌రావు, గాదగోని కొండయ్య, పన్నాల శ్రీనివాస్‌రెడ్డి, దండి నాగేశ్వరరావు, గాజుల సుకన్య, కందాల భిక్షంరెడ్డి, రాచకొండ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

చిట్యాల: మండలంలోని గుండ్రాంపల్లి గ్రామంలో అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలను వెంటనే పూర్తి చేసి అర్హులైన పేదలకు పంపిణీ చేయాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లం మహేష్ డిమాండ్ చేశారు. చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామ శివారులోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలను సోమవారం డీవైఎఫ్ఐ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2018లో డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేసినప్పటికీ నేటివరకు పూర్తి చేయలేదని విమర్శించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ మండల అధ్యక్షుడు పంది నరేష్, ఉపాధ్యక్షుడు ఆడెపు రమేష్, కూనూరు గణేశ్, జోగు గణేశ్, కురాకుల బాలు, జోగు మణి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి...

చిన్నకాపర్తి గ్రామంలో ఇళ్ల స్థలాలను అర్హులైన పేదలకు అందించాలని కోరుతూ సీపీఎం నాయకులు చిట్యాలలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, నాయకులు కోనేటి రాములు, రూపని ఇద్దయ్య, రుద్రారపు పార్వతమ్మ, ఈరమళ్ళ మణెమ్మ, రుద్రారపు భిక్షం, కోనేటి శివకుమార్ పాల్గొన్నారు.

చేనేత రుణాలు మాఫీ చేయాలి

మునుగోడు: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం చేనేత కార్మికుల రుణాలను వెంటనే మాఫీ చేయాలని చేనేత కార్మిక సంఘం మండల అధ్యక్షుడు చెర్కు సైదులు డిమాండ్ చేశారు. సోమవారం మునుగోడులో జరిగిన ఆ సంఘం మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఏడాది ఆగస్టు 7న చేనేత కార్మికుల రుణాలు మాఫీ చేస్తామని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి.. నేటికీ రుణమాఫీ చేయలేదన్నారు. చేనేత కార్మికులకు బ్యాంకు రుణాలు భారంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో సింగం శివయ్య, మిర్యాల అశోక్, చిలుకూరి మధు, కర్నాటి రాజు, రాము, సింగం గిరి, వెంకటేషం తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

చిట్యాల: కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలంగాణ మలిదశ ఉద్యకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కూనూరు సంజయ్‌దాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. తాళ్లవెల్లెంల, గుండ్రాంపల్లి, సుంకెనపల్లి గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించి మలిదశ తెలంగాణ ఉద్యమకారుల వివరాలను సేకరించి వారి కుటుంబ స్థితిగతులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఉద్యకారులకు 250 గజాల ఇంటి స్థలంతోపాటు ఇంటి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలన్నారు.

సరళాదేవికి నివాళి

నల్లగొండ టూటౌన్ : పట్టణంలోని చిన వెంకట్‌రెడ్డి ఫంక్షన్ హాల్‌లో సోమవారం ఎంవీఆర్ విద్యాసంస్థల అధినేత కొలనుపాక రవికుమార్ మాతృమూర్తి సరళాదేవి దశదిన కర్మ, సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సరళాదేవి చిత్రపటానికి ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కొలనుపాక జగదీష్, రవికుమార్, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కాలం నారాయణరెడ్డి, కార్యదర్శి జాన్‌రెడ్డి, కారింగు జానయ్య, పెరిక కరణ్‌జయరాజ్ పాల్గొన్నారు.

నల్లగొండ: పట్టణంలోని ఎంవీఆర్ విద్యా సంస్థల చైర్మన్ కొలనుపాక రవికుమార్ తల్లి కొలనుపాక సరళాదేవి సంస్మరణ సభను సోమవారం నల్లగొండలో నిర్వహించారు. కార్యక్రమానికి మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి హాజరై సరళాదేవి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గోనారెడ్డి, అబ్బగోని రమేష్, కొలనుపాక జగదీష్‌కుమార్, కొలనుపాక శేషుకుమార్, కందాల పాపిరెడ్డి, కర్నాటి విజయ్‌కుమార్, మధుసూదన్ రెడ్డి, పురుషోత్తమచార్యులు, దోసపాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

బలవంతంగా భూములు లాక్కోవద్దు


గట్టుప్పల్ : నిరసన తెలుపుతున్న నాయకులు

గట్టుప్పల్ : రీజినల్ రింగ్ రోడ్డు కోసం రైతుల వద్ద బలవంతంగా భూములు లాక్కోవద్దని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. గట్టుప్పల్ మండల పరిధిలోని గట్టుప్పల్, తేరట్‌పల్లి, నామాపురం గ్రామాల్లో సీపీఎం ఆధ్వర్యంలో సర్వే నిర్వహించిన అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట రైతులతో కలిసి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గట్టుప్పల్, తేరట్‌పల్లి, నామాపురం గ్రామాల రైతులు రీజినల్ రింగ్ రోడ్డు వద్దని తమ గోడును సీపీఎం సర్వే బృందానికి వివరించారని తెలిపారు. ఒకవేళ రింగ్ రోడ్డు నిర్మిస్తే భూమికి భూమి కావాలని, ఆ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు నారి అయిలయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బండ శ్రీశైలం, మండల కార్యదర్శి కర్నాటి మల్లేశం, జెర్రిపోతుల ధనంజయ, మండల కమిటీ సభ్యులు కర్నాటి సుధాకర్, కర్నాటి వెంకటేశం, పెద్దగాని నరసింహ, ముసుకు బుచ్చిరెడ్డి, బాధిత రైతులు పాల్గొన్నారు.

భూముల పరిశీలన

మర్రిగూడ : రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణంలో బడుగు, బలహీన వర్గాలకు చెందిన రైతులు నష్టపోతారని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని వట్టిపల్లి, బట్లపల్లి రైతులను కలిసి భూములను పరిశీలించి మాట్లాడారు. రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణంతో భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్ట పరిహారాన్ని మార్కెట్ రేటు కంటే మూడు రెట్లు అధికంగా అందించాలన్నారు. రైతులను ఇబ్బందులకు గురిచేయవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నారి ఐలయ్య, బండ శ్రీశైలం, మండల కార్యదర్శి ఏర్పుల యాదయ్య నీలకంఠం రాములు, సల్వోజు రామలింగాచారి, కొట్టం యాదయ్య, చెల్లం ముత్యాలు తదితరులు ఉన్నారు.

అందుబాటులో ఏథర్ ఎలక్ట్రిక్ వాహనాలు


ఎలక్ట్రిక్ వాహనాలతో కంపెనీ ప్రతినిధులు

నల్లగొండ టౌన్: వీటీ ఆటోమోటివ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నల్లగొండ పట్టణంలోని విద్యుత్ కాలనీ, మర్రిగూడ వద్ద ఏథర్ ఎలక్ట్రిక్ షోరూమ్‌ను సోమవారం ఏథర్ ఎనర్జీ లిమిటెడ్ జోనల్ హెడ్ మురళీకృష్ణన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ షోరూమ్‌లో కంపెనీ తాజా ఎలక్ట్రిక్ వాహన మోడల్స్ అన్నీ ఉన్నాయన్నారు. ఇటీవల విడుదలైన జెన్–5 450 సిరీస్, ఫ్యామిలీ స్కూటర్ రిజ్టా మోడల్స్ కూడా ఉన్నాయని తెలిపారు. షోరూం ప్రారంభం సందర్భంగా రూ.18,500 వరకు పండుగ ఆఫర్లు, ప్రత్యేక రాయితీలు ఇస్తున్నామన్నారు. వీటీ ఆటోమోటివ్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ తేజ పవన్ కుమార్ మాట్లాడుతూ ఈ వాహనాలు కస్టమర్లకు పెట్రోల్ ఖర్చుల నుంచి విముక్తి కల్పిస్తాయన్నారు. ఏదైనా పాత వాహనాన్ని ఏథర్ వాహనంతో ఎక్ఛేంజ్ చేసుకునే సౌలభ్యం ఉందన్నారు. ఫైనాన్స్ సౌకర్యాన్ని కూడా అందిస్తున్నామని తెలిపారు. తక్కువ డౌన్ పేమెంట్, తక్కువ వడ్డీ రేట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. కస్టమర్ల కోసం నల్లగొండలో చార్జింగ్ స్టేషన్లు కూడా ప్రారంభించారన్నారు. ఏథర్ ఎనర్జీ రీజినల్ మేనేజర్ కెవిన్ హెన్రీ, నెట్‌వర్క్ మేనేజర్ శామంత్, వీటీ ఆటోమోటివ్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ విద్యాధర్ పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డును ప్రైవేటుకు అప్పగించొద్దు



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నకిరేకల్ : సంక్షేమ బోర్డులో ఉన్న క్లైములను ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించొద్దని కోరుతూ భవన నిర్మాణం, పెయింటింగ్ అనుబంధ సంఘం సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం నకిరేకల్‌లోని కార్మిక శాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు వంటెపాక వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కార్మికులు అనేక పోరాటాలతో సాధించుకున్న సంక్షేమ బోర్డును ప్రైవేటు కంపెనీలకు అప్పగించడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు అయినాల రామచంద్రయ్య, ప్రతినిధులు దండెపల్లి రమేష్, ఏర్పుల నరేష్, వంటెపాక వెంకన్న, జానీ, సురేష్, సైదులు, లింగయ్య, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

సమస్య పరిష్కరించాలని వినతి

కనగల్: కుమ్మరుల సమస్య పరిష్కరించాలని కోరుతూ కనగల్ మండలంలోని రేగట్టే గ్రామానికి చెందిన కుమ్మరి సంఘం అధ్యక్షుడు బొడ్డుపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ డి.సునీతకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేగట్టె గ్రామ చెరువు పక్కన గల స్థలాన్ని కుండలు కాల్చేదుకు వినియోగించుకుని జీవనోపాధిని పొందుతున్నామని, ఈ స్థలంలో అంగన్‌వాడీ కేంద్రం నిర్మించేందుకు అధికారులు సర్వే చేశారని తెలిపారు. అంగన్‌వాడీ భవన నిర్మాణానికి గ్రామంలోని మరోచోట స్థలం కేటాయించాలని కోరారు. స్థలం లేకపోతే కుమ్మరులు ఉపాధి కోల్పోయి ఇబ్బందులు పడే ప్రమాదం ఉందని తెలిపారు. ఆయన వెంట దొమ్మాటి బక్కయ్య, కొండయ్య, లింగయ్య, సత్తయ్య, దొమ్మాటి శేఖర్, అశోక్‌లు ఉన్నారు.

ఉల్లాస్ యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోండి


దీపకుంటలో సర్వేను పరిశీలిస్తున్న అడిషనల్ డీఆర్‌డీఓ శ్రవణ్‌కుమార్

రామగిరి(నల్లగొండ): నిరక్షరాస్యులైన మహిళలు ఉల్లాస్ యాప్‌లో తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని అడిషనల్ డీఆర్‌డీఓ శ్రవణ్‌కుమార్ అన్నారు. నల్లగొండ మండలంలోని అనంతారం, దీపకుంట గ్రామాల్లో వీఓఏలు సోమవారం నిర్వహించిన సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 14 నుంచి 18 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న బాలికలను కిశోర బాలికల సంఘాలుగా, 60 సంవత్సరాల పైబడిన వారిని వృద్ధుల సంఘాలుగా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం సీహెచ్. వినోద, మండల సమాఖ్య అధ్యక్షురాలు మదరి పుష్పలత, సిబ్బంది గీతాబాయి. కారింగు శంకర్, ఓరుగంటి రమేష్, వీఓఏలు పెరిక మాధవి, నారబోయిన పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం


మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

నల్లగొండ టూటౌన్: కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని సవరించడంపై హర్షం వ్యక్తం చేస్తూ సోమవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు గడ్డం మహేష్ నల్లగొండలో ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో వీరెల్లి చంద్రశేఖర్, ఫకీరు మోహన్ రెడ్డి, లింగస్వామి, కంచర్ల విద్యాసాగర్‌రెడ్డి, మండల వెంకన్న,గడ్డం మహేష్, మిర్యాల వెంకన్న, చింత ముత్యాలరావు, దాసోజు యాదగిర చారి, పిండి పాపిరెడ్డి, పెరిక ముని కుమార్, తిరందాసు కనకయ్య, ఏరుకొండ హరి పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం

నల్లగొండ: పట్టణంలోని ఓల్డ్ కలెక్టరేట్ ప్రకాశం బజార్లో సోమవారం విద్యుత్ సర్వీస్ వైర్ తెగి కింద పడింది. ఈ ప్రాంతంలో ప్రజలు లేకపోవడంతో ఎటువంటి ప్రాణాపాయం జరగలేదు. ట్రాన్స్‌ఫార్మర్ పేలినట్టు శబ్దాలు రావడంతో సమీప ప్రజలు, వ్యాపారులు భయపడ్డారు. అప్రమత్తమైన విద్యుత్ శాఖ అధికారులు వెంటనే విద్యుత్ సరఫరా నిలిపివేశారు.

డిప్యుటేషన్ రద్దు చేయాలని వినతి

గట్టుప్పల్ : మండల పరిధిలోని అంతంపేట ప్రాథమిక పాఠశాల హెచ్ఎం అక్కెనపల్లి శేఖర్ డిప్యుటేషన్ రద్దు చేయాలని కోరుతూ గ్రామస్తులు సోమవారం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. విద్యా సంవత్సరంలో గ్రామం నుంచి ప్రైవేట్ పాఠశాలలకు విద్యార్థులను పంపించకుండా తల్లిదండ్రులకు అవగాహన కల్పించి పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచాడని వినతి పత్రంలో పేర్కొన్నారు. అదేవిధంగా అంతంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోషల్ ఉపాధ్యాయుడు లేక విద్యార్థులు సబ్జెక్ట్‌లో వెనకబడిపోతున్నారని కలెక్టర్‌కు వివరించారు.

చర్యలు తీసుకోవాలని..

నార్కట్‌పల్లి : మండలంలోని ఎల్లారెడ్డిగూడెం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించే కొబ్బరికాయల టెండర్‌లో అవినీతి జరుగుతోందని ఎల్లారెడ్డిగూడెం గ్రామస్తులు సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మూడేళ్ల నుంచి గ్రామ పంచాయతీకి రూ.40 లక్షల బకాయిలు వసూలు చేయలేదని, 2024లో టెండర్‌లో గ్రామ పంచాయతీ షరతులు పాటించకుండా గ్రామ కార్యదర్శి గడువు పొడిగించినట్లు వినతిపత్రంలో పేర్కొన్నారు. వీధి దీపాలు అమర్చకపోయినా బిల్లుల చెల్లింపులు జరిగినట్లు గ్రామస్తులు చిక్కుల శ్రీనివాస్, నవీన్‌కుమార్ వేర్వేరుగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

పెండింగ్ వేతనాలు ఇవ్వాలి

రామగిరి(నల్లగొండ): గ్రామపంచాయతీ కార్మికులకు రావాల్సిన మూడు నెలల పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ నల్లగొండ మండల కన్వీనర్ పోలే సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండలంలో అన్నెపర్తి గ్రామంలో గ్రామపంచాయతీ కార్మికులను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ కార్మికులకు ప్రభుత్వం గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు రెగ్యులర్‌గా ఇస్తామని హామీ ఇచ్చినా అమలు కావడం లేదన్నారు. కార్యక్రమంలో ఆమనగంటి శేఖర్ రెడ్డి, బోగరి సైదులు, కట్ట నరసింహ, మామిడి నరసింహ, మామిడి నాగయ్య, స్వామి, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

నల్లగొండ: పట్టణ సమీపంలోని కేశరాజుపల్లిలో సర్వే నంబర్ 123 లోగల తమ భూమిని ఆక్రమించుకోవాలని ప్రయత్నిస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోడిరెక్క యాదగిరి కోరారు. కేశరాజుపల్లిలోని తమ కుటుంబ సభ్యులకు చెందిన 1.08 గుంటల భూమిని గాలి మురళీకృష్ణ, రేకల శ్రీనివాసులు ఆక్రమించుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. పోలీసులను, రెవెన్యూ అధికారులను కలిసి వినతి పత్రం అందజేశామని తెలిపారు.

ఐద్వా మహాసభల ప్రచార కరపత్రాలు విడుదల


కరపత్రాలను విడుదల చేస్తున్న ఐద్వా సభ్యులు

నకిరేకల్ : హైదరాబాద్‌లో జనవరి 25, 28 తేదీల్లో జరుగనున్న ఐద్వా 14వ జాతీయ మహాసభల ప్రచార కరపత్రాలను నకిరేకల్‌లో సోమవారం ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు చెన్నబోయిన నాగమణి విడుదల చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సుంకి మణెమ్మ, ఐద్వా నాయకులు పన్నాల శశికళ, రేణుక మంజుల తదితరులు పాల్గొన్నారు.

గంగన్న పాలెంలో కుంటకు గండి

తిప్పర్తి: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తిప్పర్తి మండలంలోని గంగన్నపాలెం గ్రామంలో కుమ్మరి కుంట కట్టకు గండి పడింది. దీంతో కుంటలో నీరు మొత్తం బయటికి వెళుతున్నాయి. కుంటకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.


కుంటను పరిశీలిస్తున్న రైతులు